క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు , ఎంఈఓ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను హెచ్ఎం బీపీఏ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేసి పీఎస్ ఉష, శ్రీను, రవిశంకర్, గౌరి, విజయభవానిలను హెచ్ఎంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులంతా కలిసి విద్యార్థులకు రూ.పదివేలు విలువచేసే బుక్స్,పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగభూషణం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సోమలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి సోమలింగేశ్వర ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండితుడు సాయి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గన్నవరపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో 30 మంది మహిళలు కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కలిశెట్టి రామునాయుడు, రొంగలి వెంకన్న, శ్రీనివాసరావు, తిరుపతిరావు, రామకృష్ణ, రెడ్డి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. గరివిడి ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఇంగ్లిష్ అసిస్టెంట్ సత్యశ్రీనువాస్‌కు, తోండ్రంగి పాఠశాలకు బదిలీపై వెళ్లిన బయాలజీ ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, పీడీ శ్రీకాంత్‌లను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు యడ్ల అప్పారావు, శనపతి సన్యాసి, గంట్యాడ పైడినాయుడు, సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేనంబర్ల సబ్ డివిజన్‌కు ప్రత్యేక డ్రైవ్

చీపురుపల్లి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఉమ్మడి పట్టాదారులుగా నమోదైన రైతుల కోసం సంబంధిత సర్వే నంబర్లు సబ్ డివిజన్ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పట్టాదారులుగా ఉండిపోవడంతో సంక్షేమ పథకాలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సబ్ డివిజన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే జూన్ 30లోగా చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో గల రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తుప్పల్లో అంగన్‌వాడీ భవనం



భవనం చుట్టూ మొలిచిన తుప్పలు

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తఅగ్రహారంలో గల అంగన్‌వాడీ కేంద్రం తుప్పల్లో దర్శనమిస్తోంది. అదేంటి అంగన్వాడీ భవనం తుప్పల్లో ఉండడమేంటి అనుకుంటున్నారా.. అవును నిజమే. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న సమస్యలే ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేక అలా తుప్పల్లోకి వెళ్లిపోయింది. దీంతో సొంత భవనం ఉన్నప్పటికీ అద్దె భవనంలో కేంద్రం నిర్వహించాల్సి వస్తోంది. కొన్ని సంవత్సరాల కిందట కొత్తఅగ్రహారంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. అయితే కొంతకాలం తర్వాత ఆ భవనం పక్కనే ఉన్న ఓ పెద్ద చెట్టు కూలిపోవడంతో భవనం బీటలు వారింది. అంతేకాకుండా కిటికీలు, తలుపులు కూడా లేవు. దీంతో విషసర్పాల బెడద కూడా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో కేంద్రానికి ప్రహరీ కూడా నిర్మించారు. అయితే పాముల బెడద వల్ల కేంద్రాన్ని మరోచోటుకు మార్చేశారు. భవనానికి చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి, పిచ్చి మొక్కలు తొలగించి వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆవేదన



వేపాడ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ జేఈకి వివరిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, కోఆప్షన్ సభ్యుడు నరసయ్య

వేపాడ: మండకేంద్రం వేపాడ ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, ఏడాదిన్నర అవుతున్నా నేటికీ రోడ్డు వేయకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ సత్యవంతుడుతో పాటు కోఆప్షన్ సభ్యుడు నరసయ్య తదితరులు ఆర్అండ్‌బీ జేఈ స్వామిని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో శాఖాపరమైన అంశంపై ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్రం ప్రధాన రహదారిలో వేపాడ, వల్లంపూడిలో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన స్థలంలో సైడ్ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో గృహస్తులు, వృద్ధులు ఇంటిముందు ఇసుక బస్తాలు వేసుకున్నారని ఇంట్లోకి వెళ్లాలన్నా బయటకు రావాలన్నా వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన జేఈ స్వామి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కాలువల నిర్మాణం చేపట్టేలా చూస్తామన్నారు.

బిల్లు పెండింగ్ పెట్టడం న్యాయమా?

సమావేశంలో వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ పంచాయతీ తీర్మానంతో గతంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చెరువుగట్టుపై రైతుల అవసరాలమేరకు మెటల్ రోడ్డు వేశామని ఈ ఏడాది ఆ మెటల్ రోడ్డుపై సీసీ రోడ్డు వేస్తే ఎవరో ఫిర్యాదు చేశారని ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూఅధికారులు వచ్చి పరిశీలించారని ప్రజలకు రైతులుకు ఉపయోగపడే రోడ్డుపై అభ్యంతరాలను పరిశీలించిన ఆధికారులు నేటికి ఎటువంటి నివేదిక ఇవ్వకపోవడంతో బిల్లు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీసీ రోడ్డుపై రోడ్డువేసినా పట్టించుకోని అధికారులు ప్రజల అవసరం మేరకు పంచాయతీ తీర్మానంతో పనిచేస్తే అభ్యంతరం చెప్పటమేమిటని ప్రశ్నించారు. దీనిపై ఇరిగేషన్ ఎఈ మాట్లాడుతూ చెరువుల హద్దులు, ఆక్రమణ రెవెన్యూ పరిధిలోనిదని తాము పరిశీలనకు మాత్రమే వచ్చామన్నారు. ఎంపీపీ కలగచేసుకుని పరిస్థితి పరిశీలించి బిల్లు అయ్యేలా చూడాలని కోరారు.

పరిచయం చేసుకున్న కొత్త వైద్యులు

సమావేశం జరుగుతుండగానే పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొత్తగా బదిలీపై వచ్చిన ఆయుర్వేద, హోమియో, పీహెచ్‌సీ, పశుసంవర్ధక శాఖ వైద్యులు, వ్యవసాయశాఖ ఏఓ,స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సమావేశంలో తమను తాము పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు తదితర మండల శాఖాధికారులు పాల్గొన్నారు.

వేపాడలో రెవెన్యూ దినోత్సవం



రెవెన్యూ డే'లో మాట్లాడుతున్న ఎస్‌కోట తహసీల్దార్ శ్రీనివాసరావు



వేపాడ: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే పై అవగాహన కల్పిస్తున్న ఉపతహసీల్దార్ రామకృష్ణ

వేపాడ: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాములమ్మ నేతృత్వంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాములమ్మ, ఉపతహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ 1857 జూన్ 20న రెవెన్యూ వ్యవస్థ పుట్టిందని నాటి నుంచి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. రెవెన్యూశాఖలో పనిచేసే సిబ్బందికి ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతలు, విధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రజలు, రైతులకు భూసమస్యల పరిష్కారంపై వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో..

శృంగవరపుకోట: పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో గల ఎన్‌జీఓ హోమ్‌లో శుక్రవారం రెవెన్యూడే వేడుకలను తహసీల్దార్ డి.శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలసంవత్సరాల క్రితం రాజుల పాలన కాలంలో రెవెన్యూ వ్యవస్థకు బీజం పడిందన్నారు. నాటి నుంచి వ్యక్తులు, వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాల ఆస్తులను పరిరక్షిస్తూ, సమాజ ప్రయోజనాలను పరిరక్షించే పటిష్ట వ్యవస్థ రెవెన్యూశాఖ అని, కాలానుగుణంగా మార్పులు, చేర్పులు ఎన్ని వస్తున్నా ప్రజాప్రయోజనాలే అంతిమ లక్ష్యంగా రెవిన్యూశాఖ పనిచేస్తోందన్నారు. నేటికీ భూసమస్యలు, ఆస్తుల తగాదాలు, భూవివాదాలు, సరిహద్దు వివాదాలు, యాజమాన్య హక్కుల తగాదాలు ఇలా అన్ని వర్గాల సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించడంలో రెవెన్యూశాఖ కీలక భూమిక పోషిస్తోందన్నారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయం ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చండి



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకి సమస్యలు వివరిస్తున్న సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు

- విద్యుత్‌శాఖ ఏఈకి సూచించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని విద్యుత్‌శాఖ ఏఈ దివాకర్‌కు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆయన మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా సింగవరం గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు.. గర్భాం పంటపొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పాడయ్యాయని కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్ జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మజ్జి శ్రీనివాసరావు ట్రాన్స్‌కో ఏఈకి ఫోన్‌చేసి ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని సూచించారు. అనంతరం సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు శ్రీనివాసరావును కలిసి చాలీ, చాలీ జీతాలతో పనిచేస్తున్నామని.. జీతాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ వెంటనే ఆర్‌జేడీకి ఫోన్ చేసి అధ్యాపకుల వేతనాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భైరిపురం, కొండలావేరు ఉపాధి క్షేత్ర సహాయకులపై విచారణ విషయాన్ని చైర్మన్ శ్రీనివాసరావు దృష్టికి నాయకులు తీసుకెళ్లగా.. తాను ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, గుర్ల మండల నాయకుడు కేవీ సూర్యనారాయణరాజు, కేఎస్ఆర్‌కే ప్రసాద్, కందుల మల్లికార్జునరావు, ఎస్.కృష్ణమూర్తిరాజు, సత్తారు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నరసింహవర్మ, సుంకరి రమేష్, దేవా, తమ్మినాయుడు, మండల వెంకన్న, కొమ్ము శంకరరావు, గిడిజాల సింహాచలం, గరివిడి మండల నాయకుడు వలిరెడ్డి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు బీమాతో భరోసా



మృతుడి భార్య ఇందుకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఆర్ఎం చిరంజీవి వెంకటేష్ తదితరులు

- ఏపీజీబీ విశాఖ రీజనల్ మేనేజర్
- బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చెక్కు అందజేతత

వేపాడ: మండలంలోని వేపాడ ఏపీజీబీ బ్రాంచి పరిధిలో వల్లంపూడి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును విశాఖ రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ తదితరులు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు గ్రామసచివాలయంలో బ్రాంచి మేనేజర్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆర్ఎం మాట్లాడుతూ వల్లంపూడి గ్రామానికి చెందిన తమనాన వెంకటరావు ప్రమాదవశాత్తు గత ఏడాది జూన్ 6న చనిపోయాడన్నారు. ఆయన బీమా కట్టినందున ఆ కుటుంబానికి భరోసా కలిగిందని మృతుడి భార్య ఇందుకు రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశామన్నారు. మృతిచెందిన వెంకటరావు భార్యతో పాటు ఇద్దరు పిల్లలకు భరోసా కలిగిందన్నారు.. ప్రతి ఖాతాదారు విధిగా బీమా చెల్లించి కుటుంబానికి భరోసా కల్పించాలని కోరారు. బ్యాంకు ఖాతాదారులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నామని వ్యవసాయం, బంగారంపై, ముద్ర లాంటి రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తున్నామని చెప్పారు. ప్రతి ఖాతాదారు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ దిలీప్ శుక్లా, ఎఫ్ఐసీ షానవాజ్, ఐరెక్స్ చానల్ మేనేజర్ మాధవరావు, భానుచంద్రనాయుడు, అజీజ్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ గోపాల్, క్యాషియర్ చంద్రబాబునాయుడు, సిబ్బంది మహేష్ సీఎస్‌పీలు ప్రసన్న, ఈశ్వర్రావు, త్రినాథమ్మ, బంగారమ్మ, దేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాను అలవాటు చేసుకోండి

- శిక్షకురాలు సుజాత



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న శిక్షకురాలు

చీపురుపల్లి: సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ యోగాను అలవాటుగా చేసుకోవాలని యోగా శిక్షకురాలు గవిడి సుజాత అన్నారు. పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాలలో యోగాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగాసనాలు వేయాలని సూచించారు. యోగా పుట్టిన దేశంలో జన్మించడం మనందరి అదృష్టమన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఎంతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ప్రస్తుత ఒత్తిడి వ్యవస్థలో యోగా అవసరమని స్పష్టం చేశారు. ఎన్నో రోగాలకు కూడా దూరంగా ఉండవచ్చని చెప్పారు. అంతకుముందు ఆసనాలు వేసి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎస్ఎస్ఎస్ పీఓలు వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగా దేను విజయవంతం చేయండి

గజపతినగరం: విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న యోగా డే కార్యక్రమాన్ని విజయవతం చేయాలని.. వసతిగృహ విద్యార్థులను తరలించేందుకు ప్రభుత్వ శాఖాధికారులు సిద్ధంగా ఉండాలని మండల స్పెషలాఫీసర్ రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి గజపతినగరం నుంచి కేజీబీవీ, మోడల్ స్కూళ్లతో పాటు పలు వసతి గృహాలకు 9 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులను క్షేమంగా విశాఖ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కల్యాణి, డిప్యూటీ ఎంపీడీఓ సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ.

దత్తిరాజేరు: మండలంలోని టి. భూర్జవలస ప్రాథమికోన్నత పాఠశాలలో యోగాసనాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా హెచ్ఎం రాంబాబు మాట్లాడుతూ.. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విశాఖలో యోగా డే నిర్వహించడం మంచి పరిణామమన్నారు.

అవంతీ కళాశాలలో..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగాసనాలు వేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాలభాస్కరరావు అధ్యక్షతన యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి జె.మహలక్ష్మునాయుడు మాట్లాడుతూ.. యోగా సాధనతో ప్రశాంతమైన జీవనం లభిస్తుందని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ హేమలత మాట్లాడుతూ.. యోగాసనాలు నిత్యం వేయడం వల్ల మానసిక వికాసం, ఏకాగ్రత పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



గజపతినగరం: మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రమేష్‌కుమార్



దత్తిరాజేరు: టి భూర్జవలస పాఠశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



చీపురుపల్లి రూరల్ (గరివిడి): యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

బాధ్యతల స్వీకరణ

చీపురుపల్లి: మండల వ్యవసాయాధికారిగా ఎస్.సూర్యకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు నుంచి బదిలీపై ఆమె చీపురుపల్లి మండల వ్యవసాయాధికారిగా వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన సీహెచ్.రఘునాథ్‌కు రాజాం మండల వ్యవసాయాధికారిగా బదిలీ అయ్యింది.

నేడు మాస్ యోగా సెషన్

చీపురుపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మాస్ యోగా సెషన్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు యోగాసనాలపై శిక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

విలువలతో కూడిన విద్యే ఎస్ఎఫ్ఐ లక్ష్యం



ఎస్ఎఫ్ఐ సదస్సులో మాట్లాడుతున్న నాయకుడు రాము

శృంగవరపుకోట: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేలా ప్రభుత్వాలతో పోరాడి సాధించడమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు డి.రాము చెప్పారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎస్‌కోట ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నేతృత్వంలో ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభల కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిత్యం అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన ఎన్ఈపీ-2020 వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమ య్యే పరిస్థితి వస్తోందన్నారు. చదువు దేశాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలి కానీ, దేశాభివృద్ధిని వెనక్కి నెట్టేలా ఉండకూడదన్నారు. ప్రభుత్వం విద్యా రంగంలో తెచ్చే నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పోరాటాల వల్ల విజయనగరంలో సంక్షేమ హాస్టల్, గజపతినగరం, చీపురుపల్లి, విజయనగరంలలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయన్నారు. విద్యార్థి శ్రేయస్సు కోసం, భవిత కోసం, ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. సదస్సులో జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు, సహాయకార్యదర్శి కె.రమేష్, మండల కమిటీ నాయకులు రవి, నాయుడు, రుతూ, తదితరులు పాల్గొన్నారు.


అరుదైన యోగా స్టాంపులు, నాణేల సేకరణ



యోగా దినోత్సవం సందర్భంగా ఆర్‌బీఐ విడుదల చేసిన 10 రూపాయల నాణెం



ధ్యానంలో మనిషి ఉన్న స్టాంపు



1991లో పోస్టల్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన స్టాంప్స్



ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి విడుదల చేసిన పోస్టల్ స్టాంపు

లక్కవరపుకోట: ప్రాచీన కాలం నాటి సాంస్కృతిక, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనాలైన అరుదైన స్టాంపులు, నాణేలు, కరపత్రాలు, విదేశీ కరెన్సీ, రాజశాసనాలు సేకరిస్తూ భావితరాలకు అందజేస్తున్న ఘనత ఆ విశ్రాంతి ఉపాధ్యాయుడికే దక్కుతుంది. ఆయనే లక్కవరపుకోట మండలం రేగ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కందాల రామకృష్ణారావు. ప్రపంచం గుర్తించిన రోజుల ప్రాముఖ్యాన్ని వివరించే స్టాంపులు, నాణేలు సేకరిస్తూ అబ్బురపరుస్తున్నారు. ఇప్పటికే ప్రాచీన వస్తువులను సేకరించి పలుమార్లు ఎగ్జిబిషన్ పెట్టి ఎంతోమందికి అలనాటి సంప్రదాయాలు, సంస్కృతిని తెలియజేశారు. అరుదైన ప్రాచీన వస్తువులను సేకరించడం సుమారు 30 సంవత్సరాలుగా ఆయన కొనసాగిస్తున్నారు. జూన్ 21వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవానికి సంబంధించిన స్టాంపులు, నాణాలను ఆయన సేకరించి భద్రపరిచారు.



సూర్యనమస్కారలకు సంబంధించి తపాలా శాఖ విడుదల చేసిన స్టాంపులు